


# మానవి

## మధురాంతకం నరేంద్ర

"హలో శ్యామ్' అన్న పిలుపు వినిపించగానే వెనుదిరిగి చూశాడు శ్యామ్

సిమెంటు బెంచీ పైన రుమాలు పరుచుకుని కూర్చుని వున్నాడు సుదర్శనం చేతిలో యింగ్లీషు డిటెక్టివ్ నవల కాళ్ళదగ్గర సూట్‌కేసు పక్కనే తగిలించుకునే సంచీ అందులో నుంచీ వాటర్ బాటలూ బిస్కట్ల పాకెట్లూ యిలస్ట్రేటెడ్ వీక్లీ కనిపిస్తూ వున్నాయి ప్రయాణానికి సర్వ సన్నద్ధుడై వచ్చిన సుదర్శనం మూర్తీభవించిన జాగరూకతలా కనిపిస్తున్నాడు

ప్లాట్‌ఫాం పైన సందడిగావుంది సామాన్లని పక్కనే వుంచుకుని యెక్కడి ప్రయాణీకు లక్కడ చతికిల బడిపోయి వున్నారు ప్లాట్‌ఫాం కటు చివర్లోని అల్పాహారశాల చుట్టూ జనం గుంపులు గుంపులుగా గుమికూడిపోయి వున్నారు నీలిరంగు దుస్తుల్ని ధరించిన పోర్టర్లు అటూ యిటూ బలాదూర్లు తిరుగుతున్నారు వాల్ బోర్డుల పైని సినిమా అడ్వర్‌టైజు మెంట్ల నుంచీ తారలు వలల్ని పేనుతున్నారు

యిక్కడ స్థలముంది అంటూ సుదర్శనం మళ్లీ వోసారి పలకరించాడు

సూట్‌కేసును బెంచీపక్కనే వుంచిన తరువాత వెనుదిరిగి నువ్విలా కూచో చిన్నీ! నేను వెళ్లి మెయిలు వెళ్లిపోయిందో యేమో కనుక్కొస్తాను అన్నాడు శ్యామ్

శ్యామ్‌తో బాటూ మరో ప్రయాణీకురాలు కూడా వుందన్న సంగతి సుదర్శనాని కప్పటికిగానీ తెలియలేదు ఆమె వైపుకు చూశాడతను

అయిదున్నర అడుగుల పొడ వుంటుంది ఆమె అలంకరణ విషయమై పెద్దగా జాగ్రత్త తీసుకున్నట్టు లేదు కోల ముఖం వాలుజడ


చెవులకు చిన్న రింగులు మెడలో వొకేదండ నీలిరంగు అర్గండి చీర ఆకు చెప్పులు

మా కజిన్ అంటూ పరిచయం చేశాక నేను వెళ్లి మెయిలు వెళ్లిందో లేదో తెలుసుకుని వస్తాను అన్నాడు శ్యామ్

నేనూ మెయిలుకే బయలుదేరా।నా శ్యామ్'యివ్వాళ రైలు రెండు గంటల లేటు అది సరేగానీ నన్ను పరిచయం చేయడం మరచి పోయావు నువ్వు నిన్నింకా మతిమరుపు వదలి పెట్టలేదన్న మాట' అంటూ నవ్వ సాగాడు సుదర్శనం

తానూ వో చిరునవ్వు నవ్వి యితను సుదర్శనం వొకటో తరగతి నుంచీ డిగ్రీ వరకూ నాకు క్లాస్మేటు డిగ్రీ తరువాత నేను కాలేజీలకు గుడ్‌బై కొట్టేసినా వీడు మాత్రం బియ్యీ వరకూ వెలగబెట్టాడు ప్రస్తుతం యిక్కడే కంట్రాక్టులు చేసుకుంటున్నాడు అన్నాడు శ్యామ్

నమస్కార ప్రతి నమస్కారాలు ముగిశాయి



పోనీ టికెట్లయినా కొనుక్కొస్తాను అంటూ బయలుదేరబోయాడు శ్యామ్

"వాటికేం తొందర లేదు గానీ కాస్సేపు కూచోవోయ్ నువ్వు అంటూ వారించాడు సుదర్శనం మెయిలు వెళ్ళి పోతుందేమో ననుకుని పరుగులు తీస్తూ వచ్చినట్టున్నావు యింకా గసబోస్తూ ఆపసోపాలు పడుతున్నావు చూడు అవునూ మెయిలు పదిగంటలకని తెలుసుగదా? పదింపావు కొచ్చి మెయిలు కోసం చూస్తే యెలా దొరుకుతుందను కుంటున్నావు? యివ్వాళిలాగో లేటయింది కాబట్టి సరిపోయింది – లేకపోతే?

బయలుదేరడమేమో యెనిమిదిన్నరకే బయ ల్దేరాం రా కరెక్టుగా బస్సుదొరికితే మా వూరునుంచీ టౌనుకు అరగంట ప్రయాణం కానీ సమయానికి బస్సులు దొరకలేదు తొమ్మిదిన్నరప్పుడెప్పుడో బస్సొచ్చింది బస్టాండు నుంచీ రిక్షాలో రావడానికి పదిహేను నిముషాలు పట్టింది అంటూ సంజాయిషీ చెప్పుకున్నాడు శ్యామ్

## మానవి

చూశారా మీ కజిన్ యెక్స్క్యూజ్‌ల కోసం వెదుకుతున్నాడు నేరుగా ఆ అమ్మాయికే చెప్పసాగాడు సుదర్శనం

చిన్నప్పటి నుంచీ వీడెప్పుడూ యింతే' మీ కజినే గదా? నేను కొత్తగా చెప్పాల్సిన అవసరం వుండదు లెండి' స్కూల్లో మేమంతా వీడికి ప్రాప్తకాలజ్ఞుడని పేరు పెట్టాం అన్నట్టు మీకా యీడు చేపలకథ తెలుసా?

తెలుసు ననట్టుగా ఆమె తల వూపింది

తాను గూడా స్పోర్టివ్‌గా నవ్వేస్తూ ఆరోజుల్లో వీడికి గూడా దీర్ఘదర్శి అనే నిక్ నేముండేది అన్నాడు శ్యామ్

ముందు చూపుండడంలో తప్పేముంది చెప్పండి' మాట వరసకు యివ్వాల్టి సంగతే తీసుకోండి మెయిలుకు వెళ్లాలి– అదీ ప్రోగ్రాం రైలు పదింటికి మాయిల్లు టౌన్లోనే వుందనుకోండి కానీ యీ టౌను యిరవై మూడు మైళ్ల పొడవునా పెరిగి పోయి కూచుంది గదా' అందుకని తొమ్మిది కంతా బస్టాండు కొచ్చేశాను మామూలుగా ఆ సమయంలో ప్లెన్టీగా టౌను బస్సులుండాలి కానీ యివ్వాళనగా వొక్కటీ రాలేదు పదిగంటలకు పదిహేను నిముషాలుందనగా మా నాన్న స్కూటర్ తీసుకొచ్చాడు అలా ముందుగానే యేర్పాటు చేసుకున్నా మన్న మాట' యిక్కడ స్కూటర్ దిగినప్పుడు గంట కచ్చితంగా తొమ్మిదీ యాభై అయిదు టికెట్టు కోసమని బుకింగ్ ఆపీసుకెళ్తే క్లర్కు రెండు గంటల లేటంటూ చావు కబురు చల్లగా చెప్పాడు అయినా యీ రైళ్ళు సక్రమంగా నడుస్తాయని అనుకోవడం బుద్ధి తక్కువ యీ రైలూ, యీ వూరూ, యీ వూరి టౌను బస్సులూ, యిదిగో, యీ మా శ్యామసుందరుడూ– అందరూ మేడ్ పర్ యీచ్ అదర్ యేమంటారు?

ఆమె తల పైకెత్తి వోసారి అతడి వైపు వింతగా చూసింది

సుదర్శనం నవ్వడం లేదు ముఖం చిట్లించుకుని కళ్లజోడు లోంచి తీక్షణ మైన చూపుల్ని సారిస్తున్నాడు

ఆమె సమాధానం చెప్పలేదు ముఖాన్ని మరో వైపుకు తిప్పుకొంది

శ్యామ్ కూడా సుదర్శనం వైపోసారి విస్మయంగా తేరిపార జూశాడు అంతలోనే నవ్వేసి నువ్వు గూడా యేమీ మారలేదు అంటూ మొదలు పెట్టాడు వీడి దోరణి వింతగా కనిపిస్తోందేమో కదూ చిన్నీ నీకు' వీడెప్పుడూ యింతే' చాలా ఫ్రాంక్ కుండ బద్దలు కొట్టినట్టుగా మాట్లాడుతాడు మొహమాటాలు, గిహమాటాలు లేనే లేవు మొదలు పెట్టాడంటే యిక అంతూ ఆపే వుండవు వొట్టి వాగుడు కాయ పొరబాటున కంట్రాక్టరయ్యాడు గానీ లెక్చరరయివుంటే చాలా మంది పిల్లల వుసురుపోసుకుని వుండే వాడు

లెక్చరరయ్యే ప్రమాదం వెంట్రుక వాసిలో తప్పి పోయింది నాకు అంటూ అడ్డు తగిలాడు సుదర్శనం, చిన్నప్పుడు నాకు పద్యాలంటే చచ్చేంత యిష్టం వీదినాటకాల్లో గంటల తరబడీ రాగాలు తీసే కంగుందివాళ్లంటే పెద్ద క్రేజ్ నాకు పెద్దయ్యాక లెక్చరరయి క్లాసులో రాగాలు తీస్తూ పద్యాలు పాడాలన్నది నా యాంబిషను కానీ మానాన్న ససేమిరా వీలుగాదన్నాడు ఆయన నాకంటే బాగా ముందు చూపున్న వ్యక్తి యెమ్మేలు చదివిన వాళ్ళు కండక్టరుద్యోగాలు గూడా రాకుండా మల్లగుల్లాలు పడుతున్నారు కాబట్టి వొద్దే వొద్దన్నాడు ఆయన పోనీ డాక్టరు నవుతానన్నాను అప్పుడు అంటే సెవనియర్స్ బాక్– డాక్టరు కోర్సంటే బలే క్రేజుండేది కానీ మరో అయిదారేళ్లలో వీది వీదికీ డాక్టర్లు తయారవుతారనీ యీగలు తోలుకుంటూ కూచోవలసిందేననీ ఆయన తెలుసుకున్నాడు అప్పుడు యింజనీర్లకు డిమాండే లేదు కానీ కొద్ది రోజుల్లో వాళ్లకుచెప్పలేనంత డిమాండొచ్చి పడుతుందని ఆయన కనిపెట్టేశాడు తరా కోర్సు పూర్తయిన తరువాత, వుద్యోగం వొద్దని, కంట్రాక్టులు మొదలు పెట్ట మన్నాడు ఆయన చూపు పది పదిహేనేళ్ల ముందుంటుంది ఆయన భవిష్యద్దర్శనంలో తప్పేమయినా వుంటే చెప్పు చూద్దాం యీసారి సుదర్శనం పెదవుల పైకి చిత్రమైన నవ్వొచ్చి కూర్చుంది

అతడికి సమాదానం చెప్పలేక శ్యామ్ వుక్కిరి బిక్కిరయిపోయాడు చివరికెలాగో గొంతు పెగిలించుకుని ప్రయాణం యెంత వరకూ? అని అడిగాడు

నెల్లూరు

పెద్ద ప్రోగ్రామే వున్నట్టుంది

యెందు కలా గనుకుంటున్నావు? అంటూ రెట్టించాడు సుదర్శనం

యీలగేజీ అదీ చూసి శ్యామ్ సాగదీశాడు

నెల్లూరులో పెద్ద ప్రోగ్రామేమీలేదు వీలయితే యివ్వాల్టిరాత్రికే తిరుగుప్రయాణం అన్నాడు అతను

మరయితే యింత సరంజామా యెందుకో'

తనకు సైతం మిత్రుడ్ని యెగతాళి పట్టించగలిగే అవకాశం దొరికినందుకు శ్యామ్ సంతోష పడ్డాడు

జరుగుతున్నది వర్షాకాలం అన్ని బావుల్లోనూ కొత్త నీళ్లు! తాగిన మరుక్షణం జలుబు పట్టి తీరుతుంది పొరబాటున ‘దారిలో దాహం వేసిందే అనుకో– యేస్టేషను పంపునో ఆశ్రయించాలి అంటే యేమిటి? జలుబు కొని తెచ్చుకుంటున్నా మన్న మాట! అందుకని వేడి నీళ్ళు కాచి చల్లార్చి బాటిల్లో పట్టుకొచ్చాను మా అమ్మ చేసిన యేర్పాటిది యిక ఆకలేస్తే తినడం కోసం బిస్కట్లూ వగైరా యీ పాకెట్లోవున్నాయి యీ రైళ్లని మనం నమ్మగలమా చెప్పు? మధ్యలో యే క్రాసింగో తగలడితే ప్రయాణం మరో రెండు మూడు గంటలు వ్యాకోచిస్తుంది వెళ్లే సరికి రాత్రయి పోతే లాడ్జి తప్పని సరి పడుకునేటప్పుడు లుంగీ ముఖం కడుక్కోడానికి సోపూ టవలూ, మళ్లీ వుదయం పళ్ళు తోముకోడానికి బ్రష్షూ పేస్టూ గడ్డం చేసుకోడానికి షేవింగు సెట్టూ, తీరికదొరికితే చదువు కోడానికి మాగజయిన్లూ– అన్నీ యీ సూట్‌కేసులో వున్నాయి యెందుకయినా మంచిదని వో బెడ్‌షీటూ, యెయిర్ పిల్లో గూడా సర్ది పెట్టింది మా అమ్మ యిందులో యేది మిస్సయినా బండి కదలదు అదీ సంగతి యేమయినా నీకు ప్రాప్తకాలజ్ఞుడని పేరు పెట్టడం పొరబాటని తోస్తోంది నాకప్పుడు దీర్ఘ సూత్రుడిలా చేతులూపుకుంటూ వచ్చిందే చాలక నాదే పొరబాటంటున్నావన్న మాట!

వో నిముషం సేపు విశ్రాంతి తీసుకున్న తరువాత, తన వుపన్యాసానికి ముక్తాయింపులా యింకా యేమయినా మరచిపోయానా నేను? అంటూ ప్రశ్నించాడు సుదర్శనం

టాపిక్ మార్చడానికి ప్రయత్నిస్తూ యింతకూ యే పని మీద బయల్దేరావో చెప్పలేదు అన్నాడు శ్యామ్

సుదర్శనం వో నిముషం సేపు శ్రోతలిద్దరి వైపుకూ సీరియస్‌గా చూపుల్ని సారించాడు తరువాతో

## శుభోదయము

నిన్న మొన్నటి దాక చన్నీటి నదుల
స్నానమాడిన ప్రకృతి యుత్సాహమొంది
ముగ్ధమోహన సుకుమార మూర్తియయ్యె
ప్రభవ! నీ ప్రాభవంబు శుభ ప్రదంబు

ఆ కోకిలమ్మ తీయని గాన మాలింప
చిరుగాలి కెరటాలు పరువు లిత్తె,
చిరుగాలితో నును జెక్కిళుల్ జత చేయ
పూల బాలికలు నేత్రాలు విచ్చె,
పూదేనియల నాని పొంగి పోవగ నెంచి
భ్రమరంబు ఝుమ్మని పరవశించె,
భ్రమరఝుంకార నాదము కర్ణపేయమై
వలరాజు చిగురాకు బాకుదాల్చె,
పంచమంబున కోకిల పాట పాడ
గంధవహనంబు మెలమెల్లగా స్పృశింప
ప్రకృతి నవవసంతముతోడ పరిమళించె
పుడమి చేడియకిదియె శుభోదయంబు!

–ఎం పి జానుకవి

చిరునవ్వు నవ్వి పెళ్ళి చూపులు చూడ్డంకోసం అన్నాడు

అలాగా, కంగ్రాచ్యులేషన్స్ అన్నాడు సుదర్శనం

పెళ్ళి చూపుల కెళ్లేటప్పుడు చెప్పాల్సింది కంగ్రాచ్యులేషన్స్‌కాదు బెస్టాఫ్‌లక్ అంటూ సరిదిద్దాడు సుదర్శనం

రెండు వొకటేగదా! సర్దుకోబోయాడు శ్యామ్

ఆ రెండింటికీ మధ్య గంపెడు తతంగముంది చూడబోయే అమ్మాయి అన్ని విధాలా నచ్చాలని కోరుకుంటాం అందుకని బెస్టాఫ్‌లక్ చెప్పాలి కాని యిప్పుడిప్పుడే నిర్ణయించుకోవడం కుదరదుగదా! అందుకని యిప్పుడే కంగ్రాట్స్ చెప్పకూడదు యేమండీ మీరేమంటారు? మాట్లాడడమేలేదు అంటూ ఆమె వైపుకు చూశాడు సుదర్శనం

ఆమె సమాదానం చెప్పకుండా ముఖం తిప్పుకుంది

మీకజిన్‌కు టౌను కొత్తగా వున్నట్టుంది యింకా మీ వూరి బెరుకుతనం వదిలినట్టులేదు పైపెచ్చు పీలవుతోంది నువ్వయినా ఆమెనప్పుడప్పుడూ సిటీకి తీసుకురావాలి

నువ్వు చూడబోతున్న అమ్మాయెవరు?

శ్యామ్ తనను దారి మళ్లించడం కోసం టాపిక్ మార్చుతున్నాడన్న విషయాన్ని సైతం సుదర్శనం గమనించలేదు నెల్లూరులో మా నాన్నకు ఫ్రెండొకాయనున్నాడ్లే! ఆయన తెచ్చిన ప్రపోజల్ యిది బాగా డబ్బున్న వాళ్లని చెప్పాడు అమ్మాయి పీజీ చేసిందట అంటూ వివరాలు తెలియ జేశాడు


అయితే యికనేం? పెళ్లి కుదుర్చుకోవచ్చు అందుకే అడ్వాన్స్ కంగ్రాచ్యులేషన్స్ చెప్పానేను

హోల్ట్ హోల్ట్, యిప్పుడిప్పుడే నిర్ణయాలు వద్దన్నానా? పెళ్లంటే మాటలా యేమిటి? యీ రోజుల్లో యెలిజబుల్ బాచలర్ వున్నాడంటే యెంద రెన్నెన్ని వలలు విసుర్తారు? అన్నీ తప్పించుకోవాలి యిప్పుడు మనం వెళ్లి అమ్మాయిని చూడాలి అదీ మనపని ఆ తరువాత నిర్ణయించుకోబోయే ముందు మా అమ్మా, నాన్నా నేనూ అందరూ కూర్చుని, అన్ని విషయాలూ చర్చించి వొక నిర్ణయానికి రావాలి యింతకూ నేనిదివరకూ యెన్ని సంబంధాలు చూశానో తెలుసానీకు?

చెప్పమన్నట్టుగా తలవూపాడు శ్యామ్

యిరవైమూడు అన్నాడు సుదర్శనం కళ్లెగరేస్తూ నేను లెక్కపెట్టుకోలేదనుకున్నావుగదా నువ్వు? నీ క్కావలిస్తే లిస్టుకూడా చెప్పగలను

అయితే యీ యిరవై మూడు సంబంధాల్లోనూ నీకే అమ్మాయీ నచ్చలేదా?



యెందుకు నచ్చలేదు? దాదాపు సగం మందికి పైనే నచ్చారు

అయితే యెందుకు పెళ్లి చేసుకోలేదు?

పెళ్లి చేసుకోడానికి నచ్చడ మొకటేనా ముఖ్యం? బిగ్గరగా నవ్వేశాడు అతను పెళ్ళంటే అంత తేలికనుకున్నావా నువ్వు? జీవితంలో అదొక పెద్దమార్పు జాగ్రత్తగా ఆలోచించాలి అన్ని విషయాలూ తెలుసుకోవాలి తొందర పడగూడదు మంచీ చెడ్డా విచారించి చూసుకోవాలి తన మాటల్ని శ్యామ్‌కజిన్ వింటోందో లేదో తెలుసుకోవడం కోసం వో క్షణం ఆగి ఆమె వైపుకు చూశాడు సుదర్శనం ఆమె యింకా అటువైపుకే చూస్తోంది గొంతు సవరించుకుని మళ్లీ మొదలుపెట్టాడు అతను మా నాన్నకూడా నాలాగే చాలా జాగ్రత్తపరుడని చెప్పానుగదా నేను? అటు మా అమ్మా వాళ్లవైపునా యిటు మా నాన్నవాళ్లవైపునా రెండో బిడ్డ ఆడబిడ్డేనని, రెండో బిడ్డ కలగకుండా జాగ్రత్తపడ్డాడాయన అంత ముందు చూపు ఆయనది అసలు టాపిక్‌కు వస్తాను మొదటి పెళ్లి చూపులు యీ వూళ్లోనే జరిగాయి అమ్మాయి యెవరోగాదు సుందరమూర్తిగారి కూతురు ఆయనకు వూళ్లో యిండ్లున్నాయి పొలాలున్నాయి అమ్మాయి కూడా బియ్యే చదివింది కానీ యేం లాభం? అమ్మాయికో కన్ను మెల్ల యెగుడూ దిగుడూ కళ్ళంటే అరిష్టమని మా అమ్మకు తెలుసు దాంతో అది కాన్సిలయింది రెండో సంబంధం అనంతపురం నుంచీ వచ్చింది అమ్మాయి తండ్రికి బండ్లపాలిష్ ఫ్యాక్టరీ వుంది కానీ అమ్మాయికి తల్లిలేదు చిన్నప్పుడే చనిపోయిందట అల్లుడంటే అపేక్ష అత్తకేగదా! అత్తగారు లేనియింట్లో సంబంధం వద్దని చెప్పేసింది మా అమ్మ మూడో సంబంధం కందుకూరు నుంచీ వచ్చింది కానీ అమ్మాయికి నాన్నలేడు అన్నలిద్దరున్నారనుకో పెళ్ళయ్యాక అన్నయ్యలు తమ బాధ్యత


# మానవి

తీరిపోయిందనుకుంటారు పెట్టుపోతల ఆశ వదులుకోవల్సిందే నాలుగో సంబంధం ఆత్మకూరు నుంచీ వచ్చింది అమ్మాయి బాగా చదువుకొంది అన్నకూడా మంచి పొజిషన్లోనే వున్నాడు కానీ వాళ్ల వేలు విడిచిన మేనత్త కూతురు యింటర్‌కాస్ట్ మారేజీ చేసుకొంది యీ సంగతి నలుగురికీ తెలిస్తే మన పరువేంగాను? యిక తరువాతి సంబంధం టంగుటూరు నుంచీ వచ్చింది అమ్మాయి యెమ్మే పీహెచ్‌డి చేసి పోస్ట్ డాక్టరల్ రీసెర్చి చేస్తోంది అంత చదువుకున్న అమ్మాయి మన మాట వింటుందా? నెక్స్ట ప్రపోజల్ కర్నూలు అమ్మాయి తండ్రి నోట్లో నాలుకలేని మనిషి వాళ్లావిడ గీటుగీస్తే దాటడు అంతా ఆడపెత్తనం అలాంటి యింట్లోంచీ వచ్చిన అమ్మాయి యింకెలా వుంటుందోనని మా నాన్న అనుమానం యిక చిత్తూరు సంబంధం సంగతేమిట్రా అంటే అమ్మాయి చాయ తక్కువ సంతానం నలుపైతే యేం చేయాలి? విజయవాడ సంబంధం దాదాపు ఫిక్సయిపోయిందనే అనుకున్నాము


వారం రోజుల్లో బెట్రోతలుందనగా మా అమ్మా వాళ్ల అవ్వ పోయింది అశుభ సూచకం గదా! అదీ కాన్సిలయిపోయింది మదనపల్లె అమ్మాయి చాలా బాగుంది అయితే అమ్మాయి నాన్నకు చిన్నిల్లుందట! పైపెచ్చు వాళ్లన్నలిద్దరూ శరీరాల్ని పెంచుకుని రవుడీల్లాకనిపించారు మేనమామ పోలికలొచ్చే పిల్లలు పుడితే యిక మన సంగతి అయినట్టే గుంటూరు అమ్మాయికి అక్కచెల్లెళ్ళుగానీ అన్నదమ్ములుగానీ లేరు లక్షల ఆస్తి అయితే అమ్మాయి తండ్రి కాలాంతకుడు యీ వయసులో సైతం ఆయనగారికి లేని పోకళ్లు లేవు తీరా కూతురి పెళ్ళయిపోయాక ఆయనగారు యెంచక్కా మళ్లీ పెళ్లి చేసుకుని ఆస్తికి వారసుణ్ణి తయారు చేయడని నమ్మకమేముంది? అందులోనూ బామ్మరుదులు లేని సంబంధానికి మా బామ్మ ససేమిరా వొప్పుకోలేదు యీ సంగతులన్నీ మా కెలా తెలుసునని అనుమానం కలుగుతోంది గదా నీకు? అన్నీ కూపీలాగి తెలుసుకున్నాము తెలుసుకోకుండా బురదలో కాలేస్తే కడుక్కోవలసింది మనమేగదా! అమ్మాయి తల్లిదండ్రు లెలాంటివాళ్ళు? వాళ్ల వంశం యెలాంటిది? వాళ్ల బంధువు లెలాంటి వాళ్ళు? వాళ్ల స్థితిగతు లెలాంటివి? సంస్కార మెటువంటిది? చెడు సహవాసాలూ దుర్గుణాలూ వున్నాయా? అన్నీ ఆలోచించాలి యేమంటావు? మేము మరచిపోయిన ముఖ్యమైన విషయాలేమైనా వుంటే చెప్పు? యికపైన ఆ విషయం గూడా శ్రద్ధగా గమనించడం మొదలు పెడతాము చెప్పడం ముగిసిన తరువాత సుదర్శనం మార్కు నవ్వు అతడి పెదవులపైన కొలువు తీరింది

మిత్రుడి వాగ్ధాటి నుంచీ కోలుకోడానికి శ్యామ్‌కు అయిదారు నిముషాలు పట్టింది తరువాత యింతకూ నువ్విప్పుడు నెల్లూరులో చూడబోతున్న అమ్మాయి గురించి చెప్పడం మరచిపోయావు'అన్నాడు

నేనేదీ మరచిపోను నువ్వు జ్ఞాపకం వుంచుకున్నావో లేదో చూద్దామనుకున్నాను అంటూ కళ్లెగరేశాడు సుదర్శనం అమ్మాయి యెస్వీ యూనివర్సిటీలో యెమ్మే చేసింది వాళ్ల సొంతవూరు నెల్లూరు ప్రస్తుతం అమ్మాయి యింట్లోనే వుందని వర్తమానం, వచ్చింది యూనివర్సిటీలో వుంటున్న వో లెక్చరరు మా ఫ్రెండుకు ఫ్రెండు అతడి ద్వారా కొంచెం యిన్ఫర్మేషను లాగాను అమ్మాయి కుదురుగానే వుంటుందని తెలిసింది నెల్లూరులో సుబ్బరామిరెడ్డని వో కంట్రాక్టరున్నాడు అతనో యేడాదిపాటు వీళ్ల యింటి పక్కనే కాపురమున్నాడు ఆయన కూడా కొన్ని సంగతులు చెప్పాడు యింకా కొన్ని సోర్సుల నుంచీ వాకబు చేస్తూనే వున్నాము యింతలో అమ్మాయిని వచ్చి

ఫ్యాన్లలో ఎన్నోరకాలు ఉన్నా అన్నిరకాల ఫ్యాన్లు దొరికే చోటు ఒక్క
ఉషా, ర్యాలీ, ఓరియంట్, ఖేతాన్, సిన్ని, ఆల్‌మోనార్డ్, క్రాంప్టన్ ఫ్యాను
అన్నీ సైజులలోను దొరుకును
టేబుల్, సీలింగ్, ఎగ్జాస్టర్, పెడిస్టల్, ఎయిర్ సర్క్యులేటర్స్
మరియు వాల్ రాడ్ మోడల్స్ అన్నిలభించును
ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా ఫ్యాన్లు అమ్మకందారులు:
శ్రీ సీతారామ ఎలక్ట్రికల్ & ఫ్యాన్సీ స్టో
సామారంగం చౌక్, విజయవాడ-1. ఫోన్: 74039.




చూసి వెళ్లమని వుత్తరం వచ్చింది

అతడు మాట్లాడడం ఆపిన తరువాత తాను మొదలుపెట్టాడు శ్యామ్– మా చిన్నీ కూడా తిరుపతిలో నే యెమ్మే చేసింది ఆ అమ్మాయి బహుశా చిన్నికి తెలిసే వుంటుంది అంటూ ఆ అమ్మాయికేసి చూశాడు

యేమిటి మీ కజిన్ యెమ్మే చేసిందా' రెండుమూడు నిముషాలసేపు షాక్ నుంచి కోలుకోలేకపోయాడు సుదర్శనం చూడ్డానికి పల్లెటూరి ఎల్లలా వుంటే నేనింకాయే యెస్సెస్సెనో యింటరో చదివారని అనుకున్నాను రియల్లీ యిటీజ్యే సర్‌ప్రయిజింగ్ న్యూస్ చూశారండీ మీ కజిన్ మిమ్మల్ని పరిచయం చేశాడుగాని మీ పేరు చెప్పడం మరచిపోయాడు

మా కజిన్ పేరు

మానవి అంటూ అడ్డు తగిలింది ఆమె

మానవి చిత్రంగా వుందండీ మీ పేరు మీదే డిపార్టుమెంటు

తెలుగు

యే యియర్లో యెమ్మే చేశారు?

యెనభైమూడులో

నిజంగా' అతడు యెగిరి గంతేశాడు అయితే మీకు నీలిమ బాగా తెలిసే వుంటుంది నెల్లూరులో వాళ్ల నాన్న కామర్స్ లెక్చరరు

తెలుసేనండీ అంది ఆమె

చిన్నీ శ్యామ్ తటపటాయించసాగాడు

నువ్వాగరా బాబూ' లక్కీగా మీ కజిన్‌ను కలిశాను యిదేదో శుభ సూచకంగా వుంది నేను కొన్ని వివరాలు సేకరించుకోవచ్చు యీలోగా నువ్వెళ్లి టికెట్లు కొనుక్కొచ్చేయి మీ ఫ్రెండు– అదేనోయ్ మెయిలు– వచ్చేటయిమైపోతోంది వెళ్లు

శ్యామ్ ఆమె వైపుకోసారి చూశాడు

వెళ్లిరమ్మన్నట్టుగా ఆమె తల వూపింది

శ్యామ్ పైకి లేచి బుకింగ్ ఆఫీసువైపుకు వెళ్లిపోయాడు

మీకు నీలిమ బాగా తెలుసా? అంటూ తన యింటర్వ్యూని మొదలుపెట్టాడు సుదర్శనం

మా యిద్దరిదీ వొకేడిపార్టుమెంటు కదండీ

మీరిద్దరూ క్లోజ్‌గా మూవవుతూ వుండేవారా?

హాస్టల్లో మా యిద్దరిదీ వొకేగది

రూమ్మేట్సన్నమాట' అయితే ఆమె గురించి మీకు బాగా తెలిసే వుంటుంది

'వాళ్లింటికెప్పుడయినా వెళ్లారా?

మా నేటివ్ ప్లేసు కూడా నెల్లూరే' చాలాసార్లు వెళ్లాను

'వాళ్లెలాంటి వాళ్లు?

'అంటే?

అదేనండీ మంచివాళ్లేనా అని? అంటే మర్యాదస్తులేనా అని

మంచి వాళ్లేనని నేననుకుంటున్నాను

'వాళ్ల నాన్నగారు బాగా డబ్బు వెనకేశారని

యేమో' నాకా సంగతి తెలియదు

మీరలా చెబితే యెలా చెప్పండి? నీలిమతో బాటూ వొకే గదిలో వున్నారుగదా? వాళ్లు దనవంతులవునో కాదో చెప్పలేరా?

వో మాదిరి దనవంతులుగానే కనిపించారు

నీలిమ అన్నయ్య ఫారిన్‌లో వున్నాడని

నిజమే'

అతనేమయినా డబ్బులు పంపుతూ వుంటాడా?

అతను స్కాలర్‌షిప్ పైన ఫారిన్ వెళ్లాడు నాకంతే తెలుసు

నీలిమకు వో అక్కయ్య వుందన్నారు

వుంది ఆమెకు పెళ్లయిపోయింది ప్రస్తుతం గూడూర్లో వుంటోంది

వాళ్లు మొత్తం ముగ్గురే గదా ఎల్లలు

అవునండీ

వెరీ గుడ్ అయితే నీలిమే చిన్నమ్మాయి అన్నమాట'

నీలిమ నాన్నగారి నెప్పుడైనా చూశారామీరు?

చూశాను

ఆయనెలాంటి వాడు?

మంచివాడే'

అదిగాదు ఆయన స్వబావం యెలాంటిదో

మీరు డొంక తిరుగుడుగా అడుగుతున్నారు ఆయన లెక్చరరు గదా' మంచి లెక్చరరుగా పేరుంది యెప్పుడూ పుస్తకాలూ, క్లాసులూ, అదే ఆయన ద్యాస

ట్యూషన్లు చెప్పి బాగా సంపాదించాడని

వొకప్పుడు ట్యూషన్లు చెప్పేవారు కానీ సంపాదించారో లేదో నాకు తెలియదు

ఆస్తిపాస్తులేవైనా వున్నాయా?

నాకు తెలియదు

వాళ్లమ్మగారు

'వాళ్లన్నయ్యకు పెళ్లయిందా?

అయింది వాళ్లిద్దరూ ఫారిన్‌లో నే వున్నారు

నీలిమ యెలా వుంటుంది?

బాగానే వుంటుంది

బాగానే అంటే యెంత పొడవుంటుంది?

అయిదున్నర అడుగులుండవచ్చు

ఎర్రగా వుంటుందా?

చామన చాయ

నాట్‌బాడ్' వుద్యోగం చేసే యాంబిషన్ వుందా ఆమెకు

వుద్యోగం దొరికితే చేయాలనే అనుకుంటూ వుండేది

వాళ్ల బంధువు లెలాంటివాళ్లు? అంటే వాళ్ల వంశం

ఆ వివరాలు నాకు తెలియదు

యింకో మడగాలి? కాలేజీలో ఆమె ప్రవర్తన యెలా వుండేది?

చాలా యెంబ్రాసింగ్ ప్రశ్న అడిగినట్టున్నాను పోనీ ఆ సంగతి వదిలేయండి నేను వాకబు చేయడం మరచిపోయిన ప్రశ్నలేవైనా వున్నాయా?

నీలిమకిదివరకెప్పుడయినా మీకు తెలిసి పెళ్లి చూపులు జరిగాయా?'

జరిగాయి

క్లూ దొరికిన డిటెక్టివ్‌లా సుదర్శనం యెగిరి గంతేశాడు జరిగాయి అంటున్నారు యెన్నిసార్లు జరిగాయేమిటి?

చాలాసార్లు వో పదిసార్లు జరిగుంటాయి

వొక్కటీ కుదర్లేదా?

కుదిరి వుంటే పెళ్లయి పోయి వుండేది గదండీ,

యెందుకు కుదర్లేదో మీకు తెలుసా?

వొక సంబంధం బెజవాడ నుంచీ వచ్చింది అబ్బాయి లెక్చరరు కట్నం రెండు లక్షలు డిమాండు చేశాడు

యెంత అన్యాయం' లెక్చరరుకేమిటి? రెండు లక్షల కట్నమేమిటి? తానేమయినా సేల్స్‌టాక్సు ఆఫీసర్ననీ అనుకున్నాడా అతను అలాంటి సంబంధం తప్పిపోవడమే మేలు

వో సంబందం నెల్లూరు నుంచే వచ్చింది

అబ్బాయి బిజినెస్‌మాన్ కనీసం రెండు ఫ్లాట్లయినా కట్నంగా కావాలన్నాడు

ఫ్లాట్స్‌గానే యివ్వాలని యేముంది? కాష్ అయితే చేదా యేమిటి? వొట్టి ఫూల్‌లాగున్నాడు

మరో సంబంధం తిరుపతి నుంచీ వచ్చింది అబ్బాయి ఫిజిక్స్‌లో పీహెచ్చీ నీలిమ అన్నయ్య ద్వారా ఫారిన్ చాన్సు సంపాదించిపెడితే పెళ్లి కొప్పుకుంటానన్నాడు

వీసాలూ ఫారిన్ కరెన్సీ అన్నీ కూడా సంపాదించి పెట్టమనలేక పోయాడా? వున్నదేశంలో పూరేగితే చాలదనుకున్నాడేమో!

యింకో సంబందం కడపనుంచీ వాళ్ళు జాతకాలు కుదర్లేదని అన్నారు

మంచి జ్యోతిష్యుడి దగ్గరికే వెళ్లారా వాళ్ళు?

కర్నూలు సంబందం ఫిక్సయిపోయిందనే అనుకున్నారు యింతలో వాళ్లెవరో మరో పదివేలు యెక్కువగా యిచ్చి ఆ అబ్బాయిని తన్నుకు పోయారు

ఆ పదివేలూ వీళ్లేమొహాన పారేస్తామనలేక పోయారా?

చిత్తూరు వాళ్ళు అబ్బాయికి వుద్యోగం తీసివ్వగలిగితేనే పెళ్లి కుదురుతుందని గిరిగీసి చెప్పేశారు

వుద్యోగాలేమయినా బజార్లో దొరుకుతున్నాయా? కట్నం డబ్బుల్తో వ్యాపారం చేసుకుంటే మర్యాదకేమీ తక్కువైపోదుగదా! తరువాత ?

'అన్నీ యిలాంటి సంబందాలే లెండి అందుకే తప్పిపోయాయి

అన్నీ నచ్చాకే పెళ్లి అనుకున్నప్పుడు నచ్చక పోయిన సంబందాన్ని కాన్సిల్ చేసుకోవాల్సిందేగదా! యిలాంటి సంబంధాలు తప్పిపోవడమే మేలు యేమంటారు?

మీ కజినింకా బుకింగ్ కౌంటరు నుంచి బయట పడినట్టులేదు వీడెప్పుడూ యింతేనండీ దీర్ఘ సూత్రుడని పేరు పెట్టామని చెప్పానుగదా! సుదర్శనం నవ్వబోయాడు

## మానవి

ఆమె సీరియస్‌గా వుండడం చూసి బలవంతంగా ఆపుకున్నాడు

ప్లాట్‌ఫారం పైన యింకా అలజడి తగ్గలేదు క్యాంటీనువాలా శతావధాన్నాన్ని కొనసాగిస్తున్నాడు రైల్వే వుద్యోగులు తాపీగా తమ పనిని తాము చేసుకుపోతున్నారు

మీ ఫ్రెండుకే పెళ్లి సంబంధం కుదిరిపోతే యెలా వుంటుందంటారు? అంటూ మళ్లీ మొదలు పెట్టాడు సుదర్శనం

ఫ్రెండుగా మీరు సంతోషిస్తారా, లేదా?

తన స్నేహితురాలి కింత మంచి సంబంధం కుదురుతున్నందుకు ఆమె అసూయపడుతోందని భావించిన సుదర్శనం మరికాస్త వుడికించడానికి ప్రయత్నించాడు

కుదిరితే బాగానే వుంటుంది కానీ కుదిరే అవకాశాలు కనిపించడం లేదు అంది ఆమె నింపాదిగా


సుదర్శనం వులిక్కిపడ్డాడు యేమిటీ యేమిటంటున్నారు అంటూ తడబడిపోయాడు

నీలిమ వాళ్లకు నెల్లూర్లో మంచి యిల్లుంది అమ్మితే రెండు మూడు లక్షలు వస్తుంది ఆ డబ్బులు పెట్టి ఆమె పెళ్లి చేయాలని వాళ్ల అమ్మా నాన్నల వుద్దేశం అందుకు నీలిమ ససేమిరా వొప్పుకోలేదు

నీలిమకో అత్త కొడుకున్నాడు ఆమె వాళ్ల బావనేపెళ్లాడాలని నిర్ణయించుకొంది అతను డిగ్రీ మాత్రమే చేశాడు పల్లెటూళ్లో వ్యవసాయం చేసుకుంటున్నాడు, తనకంటె తక్కువ చదువుకున్నవాణ్ని పెళ్లి చేసుకుంటా నన్నందుకు వాళ్ల అమ్మా నాన్నా నానా హడావుడి చేసి పారేశారు కాని నీలిమ తన నిర్ణయాన్ని మార్చుకోలేదు

సుదర్శనం మ్రాన్పడిపోయాడు

రైల్వేస్టేషను స్పీకర్ళ్లు మెయిలు రాబోతోందని ప్రకటించడం కోసం మిమిక్రీ మొదలు పెట్టాయి




పోర్టర్ళ్లు యినుపచక్రాల బండ్లను డబడబమని లాక్కుపోతున్నారు

'నాకో అనుమానం యీ విషయాలన్నీ మీకెలా తెలిసాయి? సుదర్శనంలోని డిటెక్టివ్ మళ్లీ మేలుకున్నాడు

ఆమె సమాధానంగా వో చిరునవ్వు నవ్వింది

మీరు చెబుతున్న మాటల్ని అలాగే నమ్మేస్తాననుకోకండి నేనంత తెలివి తక్కువవాణ్ణికాదు యీ విషయాలన్నీ నెల్లూరులో దిగాక మళ్లీ వోసారి వాకబు చేసి తెలుసుకుంటాను

మీకా శ్రమ అక్కర్లేదండీ మీరు పెళ్లి చూపులకెళ్లాల్సిన అవసరంలేదు యెందుకంటే- నాపేరు మానవిగాదు నీలిమ నేనే నీలిమను

సుదర్శనం హతాశుడైపోయాడు

అంతలో 'శ్యామ్ మిమ్మల్ని కజినని అన్నాడు అంటూ మరో సందేహాన్ని వెలిబుచ్చాడు

మామ కూతుర్ని కూడా కజినని అనొచ్చు అన్నట్టు మీరు మరచిపోయిన సంగతేమిటో చెప్పమంటారా?

ఆడపిల్ల శరీరంలో గూడా రక్త మాంసాలుంటాయి ఆవేశకావేషాలుంటాయి స్పందించే హృదయ ముంటుంది ఆలోచించే బుర్ర వుంటుంది పెళ్లి చూపుల సమయంలో తలవంచుకుని పరీక్షకు కూర్చున్న ఆడపిల్ల జడపదార్థంగాదు ఆమెగూడా మనిషే! మీరు మరచిపోయిన విషయం అదేనండీ.

మరేమీ బాదపడకండి సుదర్శనంగారూ! మీ మీద నాకేమీ కోపంలేదు డిగ్రీలూ యిండ్లూ, ఆస్తులూ నగలూ దుస్తులూ యివన్నీ పైపై ఆడంబరాలు పెళ్లి సంబందాల్లో చూడవలసింది వీటనిగాదు నాకా విషయం వారం క్రితమే తెల్సింది

* * * * * *

రైలు కదల బోతుండగా పరిగెత్తుకుంటూవచ్చి కంపార్టుమెంటులోకి గంతేసిన శ్యామ్ 'బుకింగాఫీసుదగ్గర రష్ యెక్కువై పోయింది అన్నట్టు సుదర్శనం యేడీ? అని అడిగాడు

ఆయన ప్రయాణం ఆగిపోయింది అంది నీలిమ

నువ్వే నీలిమనని చెప్పేశావా యేమిటి?'

ఆమె మౌనంగా వుండిపోయింది

కాస్సేపు గడిచాక నీ పేరు మానవి అని చెప్పావు అలాంటిపేరు యెక్కడయినా వుంటుందా చిన్నీ? అని ప్రశ్నించాడు శ్యామ్

మానవుడు- పులింగం మానవి స్త్రీలింగం అంది ఆమె

మానవుడు అన్న పదానికి స్త్రీలింగం వుందా?

స్త్రీ కూడా మానవ మాత్రురాలే అయినప్పుడు మానవుడు అన్నదానికి స్త్రీలింగ మెందుకు వుండకూడదు? సమాధానం బులెట్‌లా దూసుకొచ్చింది

'అవును యెందుకుండకూడదు' అనుకున్నాడు శ్యామ్ □